మాట్లాడుతున్న జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్



ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 1 డిసెంబరు 2024

# పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలి

● జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు

కడప కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2025లో భాగంగా కలెక్టర్ డాక్టర్ సి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈ ఆర్వోలతో జిల్లా ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయాలన్నారు. 18 ఏళ్ల పైబడిన వారిని మాత్రమే కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని, వారి వివరాలు పక్కాగా ఉండాలన్నారు. బీఎల్వోలు క్షేత్రస్థాయిలో 100శాతం ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు వారి ఫిర్యాదులను ముందుగానే అందించాలన్నారు. క్షేత్రస్థాయిలో నాయకులకు తెలియజేసి అందరూ సహకరించాలన్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి మెజార్టీ క్లెయిమ్స్ పరిష్కరించాలన్నారు. ఫారమ్-7 దరఖాస్తులను కమిషన్ నిబంధనలు పాటించి తొలగించాలన్నారు. 100శాతం ప్రతి క్లెయిమ్, అభ్యంతరాలు కచ్చితంగా పరిశీలన జరగాలన్నారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రతినిధుల నుంచి అందిన ఫిర్యాదుల విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు క్లెయిమ్స్ పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 16,41,347 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఫారమ్ 6, 7, 8లకు సంబంధించిన క్లెయిమ్స్ పరిశీలన జరుగుతోందన్నారు. నవంబరు 24లోపు వచ్చిన క్లెయిమ్స్, అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు 29 వతేదీ నుంచి విచారణ చేపట్టామన్నారు. జనవరి 1వ తేదీ నాటికి తప్పులు లేని ఓటర్ల జాబితాను ప్రచురిస్తామన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 8న సాగునీటి సంఘాల ఎన్నికలు

కడప కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాలకు 8వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించి శనివారం కలెక్టరేట్ సభాభవనంలో జిల్లా నీటి వనరుల శాఖ, మండల అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిసెంబరు 5న సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రకటన వెలువడనుందన్నారు. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ ఎన్నికలు పార్టీల కతీతంగా మంచి వాతావరణంలో వీలైనంత మేరకు ఏకగ్రీవ తీర్మానాలతో జరపాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఆ మేరకు జిల్లాలోని అన్నిశాఖల అధికారులు పటిష్ఠంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో శ్రీనివాసులు, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఈవో మీనాక్షి, తహశీల్దార్లు, అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమిషనర్లు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో జిల్లాకు 4వ స్థానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీలో జిల్లాకు 4వ స్థానం లభించింది. మొత్తం 2,58,918 మందికి రూ.110,41,88,000లు మంజూరు అయ్యాయి. అందులో 2,48,491 మందికి శనివారం రూ.105,80,50,500లు పంపిణీ చేశారు. 95.99 శాతం ప్రగతి సాధించారు. జిల్లాలో మరో 10,750 మంది పింఛను తీసుకోవాల్సి ఉంది. ఇందులో కడప పట్టణంలోనే 1192 మంది మొదటిరోజు పింఛను పొందలేకపోయారు. ఇదిలా ఉండగా జిల్లాలో పులివెందుల పట్టణం ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ 7,218 పింఛన్లు మంజూరు కాగా 7,026 మందికి పింఛన్లు పంపిణీ చేసి 97.34 శాతం ప్రగతి సాధించారు. బి.కోడూరు మండలం చివరిస్థానంలో నిలిచింది. ఇక్కడ 3,441 పింఛన్లు మంజూరు కాగా 3199 పింఛన్లు పంపిణీ చేసి చివరిస్థానంలో నిలిచింది.

## జాతీయ రహదారికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి స్పందన

పులివెందుల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-బి.కొత్తపల్లె జాతీయ రహదారికి మరమ్మత్తులు ప్రారంభించారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'పేరుకే జాతీయ రహదారి..రోడ్డంతా గుంతలే' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనికి స్పందించిన జాతీయ రహదారి అధికారులు మరమ్మతులు చేపట్టారు. శనివారం తొండూరు సమీపంలో ఈ గుంతల రహదారికి ప్యాచ్‌లు వేసే కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ మరమ్మతులు కూడా పూర్తిస్థాయిలో చేయడం లేదు. త్వరలోనే నాలుగు వరుసల రోడ్డు పనులు ప్రారంభమవుతాయని, రోడ్డు ఇబ్బందిగా ఉన్నచోట మాత్రమే పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.



తొండూరు వద్ద జాతీయ రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

డాక్టర్ చెరుకూరి శ్రీధర్ కలెక్టరుగా వచ్చి మూడు వారాలైంది. చాలా తక్కువ వ్యవధిలోనే ఇటు పరిపాలనపరంగా, అటు జనంలోనూ తనదైన పేరు తెచ్చుకున్నారు. జనం సమస్యలు ఆకళింపు చేసుకుని రంగంలోకి దిగారు. ఇక పల్లెనిద్రతో, పల్లెజనంతో మమేకమవుతూ వారిలో ఒకరిగా మారి.. వారి సమస్యలు విని వాటిని పరిష్కరించేందుకు శ్రీకారం చుడుతున్నారు. అర్జీదారులకు భరోసా కల్పిస్తున్నారు. ఇక ప్రభుత్వ ప్రైవేటు భూములను కబ్జా చేసి.. ఫ్రీహోల్డ్ పేరిట అక్రమంగా భూములు కొట్టేసిన వారిపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి సంబంధించి వివిధ శాఖల సమీక్షలో హెచ్‌వోడీలు చెప్పే లెక్కలు కాకుండా ఆ సబ్జెక్టుకు సంబంధించి లోతుగా వెళుతున్నారు. ఆషామాషీ, కాకిలెక్కలు ఈయన దగ్గర చెప్పడం కుదరదనే స్థాయికి జిల్లా అధికారులు వచ్చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధి, భూకబ్జాలు అంశాలపై శనివారం కలెక్టర్‌తో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ నిర్వహించింది. ఇందులో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

- (కడప-ఆంధ్రజ్యోతి)

# కబ్జాదారులపై ఉక్కుపాదం

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



**ఆంధ్రజ్యోతి :** జిల్లా సమగ్రాభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రచించారు? ఎలాంటి సమస్యలు గుర్తించారు?

**కలెక్టర్:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర విజన్-2047 విజన్ మేరకు జిల్లా సమగ్రాభివృద్ధికి ఐదేళ్ల (2024-29) యాక్షన్‌ప్లాన్ రూపొందించాం. ప్రతి రంగంలోనూ 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రణాళిక రూపొందించాం. ఇక నేను వచ్చిన మూడువారాల్లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన, గ్రామాల్లో తిరిగేటప్పుడు జనంలో పర్యటించేటప్పుడు ప్రజలు ఇచ్చే వినతిపత్రాలు, ప్రజాప్రతినిధుల ఫిర్యాదులు చూస్తే ఎక్కువ భూ సమస్యలున్నాయి. ఆన్‌లైన్‌లో ఒకటుంటే సాగులో మరొకరున్నారు. తండ్రి పేరిట ఉన్న భూములు వారసుల పేరిట రికార్డుల్లో లేవు. భూ ఆక్రమణలు జరిగాయి. రికార్డులు అప్‌డేట్ లేవు. వీటిని గుర్తించాం.

**ఆంధ్రజ్యోతి :** మరి ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం చూపుతారు?

**కలెక్టర్:** భూసమస్యలను పరిష్కరించేందుకు 'పల్లె కోసం-ప్రగతి కోసం' అనే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. దీని ద్వారా వీఆర్వో 1బీ రికార్డులను ప్రతి ఇంటికీ తీసుకెళతారు, రికార్డుల్లో 1బీలో మీపేరు ఉందా, ఏమైనా తప్పులున్నాయా, సర్వేనెంబరు తేడా ఉందా, విస్తీర్ణంలో తేడా ఉందా అని భూయజమాని వద్దకే వెళ్లి అడుగుతారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నా.. వారసత్వ భూములలో తండ్రి పేరు మీదుండే భూముల విస్తీర్ణంలో తేడా ఉన్నా.. లేదూ అన్నీ కరెక్టుగా ఉన్నాసరే రైతుల నుంచి ఓ దరఖాస్తు తీసుకుంటాం. 21 రోజుల్లో రికార్డులు స్వచ్ఛీకరణ చేసి మళ్లీ వాటిని రైతుల వద్దకు తీసుకెళతాం. సమస్య పరిష్కారం అయితే రైతుల నుంచి దరఖాస్తు తీసుకుంటాం. భూ రికార్డులను సరిచేయడం రెవెన్యూ ప్రాథమిక విధి. తహశీల్దార్లు, వీఆర్వోలు పబ్లిక్ సర్వెంట్లనే విషయం మరచిపోవద్దు. వారిలో సేవాభావం పెంచేందుకు భూరికార్డులను స్వచ్ఛీకరణ చేసి భూసమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించుకున్నాం. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ భూముల హద్దులు, ఇతర ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురై ఉంటే వాటి హద్దులను చూస్తాం. రికార్డులను సరిచేస్తాం. అలాగే ప్రభుత్వం విద్య ఉపాధిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. నిరుద్యోగ యువతను గుర్తించి వారికి స్కిల్ డెవలప్‌మెంటులో శిక్షణ ఇవ్వడంతో పాటు జాబ్‌మేళా ద్వారా ఉద్యోగం కల్పిస్తాం. ఇక జిల్లాకు చెందిన వారు ప్రపంచంలో సాఫ్ట్‌వేర్, విద్య, వ్యాపార, సైంటిస్టు రంగాల్లో సక్సెస్ అయిన వారిని గుర్తించి ఓ ఇన్‌స్పిరేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తాం. పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేలా ప్రత్యేక కార్యక్రమం చేయాలని నిర్ణయించాం.

**ఆంధ్రజ్యోతి :** జిల్లాలో భూకబ్జాలు ఇష్టానుసారంగా జరిగాయి. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

**కలెక్టర్:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూకబ్జాలపై చాలా సీరియస్‌గా ఉన్నారు. ఇటీవలే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చారు. జిల్లాలో 3500 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమించారు. బద్వేలు, సీకేదిన్నె, చక్రాయపేట, మీఎన్‌పల్లె, బద్వేలు నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో గుర్తించాం. బద్వేలు, కడపలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. వారి వివరాలు తీసుకున్నాం. జాయింట్ కలెక్టరు నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుంటాం. ఇక నకిలీ పత్రాలు సృష్టించి ఇతర ట్యాంపరింగ్ చేసిన వారిపై కఠిన ల్యాండ్ గ్రాబింగ్ చట్టం అమలు చేస్తాం. త్వరలోనే టాస్క్‌ఫోర్స్ పని ప్రారంభించనుంది.

**ఆంధ్రజ్యోతి :** ఫ్రీహోల్డ్ భూముల్లో అక్రమాలపై చర్యలేంటి?

**కలెక్టర్:** జిల్లాలో 76వేల ఎకరాల్లో ఫ్రీహోల్డ్ చేశారు. అయితే ఇక్కడ సుమారు 9వేల ఎకరాలు చట్ట వ్యతిరేకంగా ఫ్రీహోల్డ్ చేశారు. జిల్లాలో ప్రతి ఎకరాను స్పష్టంగా వెరిఫై చేస్తున్నాం. పూర్తయిన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ రికార్డులు ట్యాంపరింగ్ చేసి కొందరు, అధికారులను లోబర్చుకుని కొందరు తప్పుడు పత్రాలు తీసుకుని లబ్ధి పొందారు. వీరందరిపై చర్యలు తీసుకుంటాం.

**ఆంధ్రజ్యోతి :** పల్లెనిద్ర కార్యక్రమం ఆలోచన ఎలా వచ్చింది?

**కలెక్టర్:** ఇక్కడకు వచ్చిన తరువాత ఫిర్యాదులు, ఇతర వాటిని చూసి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం. కలసపాడు మండలంలోని తెల్లపాడు గ్రామ పంచాయతీని మొదట ఎన్నుకున్నాం. హంగు ఆర్భాటం ప్రత్యేక వేదిక లేకుండా జనంతోనే మమేకమయ్యాం. వారితో కలిసి కూర్చున్నా. వారు నాతో చెప్పే సాధక బాధకాలు విన్నాను. వీటిలో వ్యక్తిగతంగా వచ్చినా, సామూహికంగా వచ్చినా కూడా ఎక్కువ భూసమస్యలే ఉన్నాయి. వారితో మమేకం కావడంతో వారి సమస్యలు చెప్పుకొచ్చారు. తెల్లపాడు నుంచి కలసపాడుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో 8వతరగతిలోనే విద్యార్థులు స్కూలు మానేస్తున్నారు. వెంటనే బస్సు ఏర్పాటుచేశా. ఉదయం స్కూలు టైంకు మరలా సాయంత్రం స్కూలు వదిలిన తరువాత బస్సు వెళుతుంది. ఇంకా కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించాం. ఈ కార్యక్రమాన్ని కంటిన్యూ చేస్తాం.

**ఆంధ్రజ్యోతి :** సివిల్ సప్లై గాడి తప్పింది. ఎంఎల్ఎస్ పాయింటులో బస్తాకు 3కేజీలు తక్కువ వస్తోంది..


**కలెక్టర్:** నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం ఉచితంగానే బియ్యం అందిస్తుంది, ఎంఎల్ఎస్ పాయింటు నుంచి డీలర్లకు తూకం వేసి ఇవ్వాలి. అలా కాకుండా ఒక్కో బస్తాకు 3 కేజీలు తక్కువగా వస్తే అది కింది స్థాయికి పోయేసరికి తూకం తగ్గి అంతిమంగా పేదవాడు నష్టపోతాడు. అందుకే ఎంఎల్ఎస్ పాయింటులో తూకం వేసిన తర్వాతనే డీలర్లకు అందించాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం.

**ఆంధ్రజ్యోతి :** కడపలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు చేపడతారు?

**కలెక్టర్:** కడప కార్పొరేషన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాం. ఉన్న నీటి వనరులతోనే ప్రతి రోజూ 2గంటలు సరఫరా చేసే విధంగా ప్రణాళిక రూపొందించాం. వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళిక రూపొందించాం. పులివెందులలో తాగునీటి సమస్యను రెండురోజుల్లో పరిష్కరించాం.

**ఆంధ్రజ్యోతి :** గండికోట అభివృద్ధి ప్రణాళిక ఏంటి?

**కలెక్టర్:** గండికోట.. ఇది కడపజిల్లా టూరిజంకు హార్ట్‌పాయింటు లాంటిది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా సహజసిద్ధంగా ఇక్కడ కెనాల్ ఏర్పడింది. ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రూ.79 కోట్లతో ఇక్కడ అభివృద్ధి చేయనున్నాం. టూరిస్టుల కోసం, రాత్రిపూట బస చేసేవారి కోసం వసతి, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రపంచానికే ఇదొక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నాం. ఈ మేరకు ముఖ్యమంత్రి దీనిపై ప్రత్యేక దృష్టిసారించారు.



**ఆంధ్రజ్యోతి :** కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారు?

**కలెక్టర్:** సంక్రాంతి నాటికి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది, 2వ తేదీ సోమవారం నుంచి దరఖాస్తులను గ్రామాల్లోని వార్డు సచివాలయాల్లో స్వీకరిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందిస్తాం.

- ● 3500 ఎకరాల భూములు ఆక్రమణ
- ● ఆక్రమణదారులపై ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ అమలు
- ● ఆక్రమిత భూములు తిరిగి స్వాధీనం
- ● జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- ● ఫ్రీహోల్డ్ భూముల అక్రమాలపైనా చర్యలు
- ● బద్వేలు కబ్జాలపై ప్రత్యేక గురి
- ● భూ సమస్యల పరిష్కారానికి 'పల్లె కోసం.. ప్రగతి కోసం'
- ● పల్లెనిద్రతో జనంతో మమేకం
- ● నేరుగా సమస్యలు వినే అవకాశం
- ● కడపకు రోజూ రెండుగంటలు తాగునీరు
- ● గండికోట ప్రపంచంలోనే సహజసిద్ధ పర్యాటక ప్రదేశం
- ● రేపటి నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు
- ● ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో డాక్టర్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

## కన్న కొడుకును హత్య చేసిన తండ్రి

పులివెందుల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఉన్న సుగాలితాండాలో కన్న కొడుకును తండ్రి హత్య చేశాడు. వివరాలిలా.. సుగాలితాండాకు చెందిన కుళ్లాయప్ప నాయక్‌కు భార్య, కొడుకు ఉన్నారు. భార్య ఆరు నెలల క్రితం అనారోగ్యంతో ఆమె మృతిచెందింది. దీంతో ఆయన కుమారుడు రాజ్‌కుమార్‌నాయక్ (24) తన తల్లి మృతికి నిత్యం బాధపడేవాడు. తండ్రి వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తన తల్లి అనారోగ్యంతో చనిపోయిందని భావించేవాడు. ఇదే విషయమై తండ్రితో కుమారుడు రోజూ ఘర్షణకు పాల్పడేవాడు. ఈ వ్యవహారంపై ఇటీవల కుళాయప్ప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి కుళ్లాయప్పను రాజ్‌కుమార్ కొట్టాడు.



సంఘటన స్థలంలో రాజ్‌కుమార్‌నాయక్ మృతదేహం

దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కుళాయప్ప శనివారం తెల్లవారు జామున మిద్దెపై నిద్రిస్తున్న కొడుకు రాజ్‌కుమార్ తలపై రోకలిబండతో మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో డీఎస్పీ మురళి, రూరల్ సీఐ రమణ, ఎస్‌ఐ విష్ణునారాయణ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మున్సిపల్ మీట్‌లో ఉద్రిక్తత

● వైసీపీ టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం

● సభనుంచి వెళ్లిపోయిన వైసీపీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఉద్రిక్తతకు దారితీసింది. టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం కూల్చివేయడానికి సంబంధించి ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి మధ్య మాటా మాటా పెరిగింది. టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, బంగారురెడ్డి మధ్య మాటల యుద్ధం పెరిగి తోపులాట వరకు పోయి ఉద్రిక్తతకు దారితీసింది. ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన ప్రారంభం అయింది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మున్సిపాలిటీ ఆర్థిక పరిస్థితిని గురించి కౌన్సిల్‌కు తెలియజేశారు. పలువురు కౌన్సిలర్లు పలు సమస్యలు సభ దృష్టికి తెచ్చారు. వైసీపీ కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి మాట్లాడుతూ టిడ్కో స్థలాలు విక్రయించినా అక్కడ అభివృద్ధి చేయలేదని అసలుకు ఆ ప్లాట్లు ఉంటాయా రద్దు చేస్తారా అనేది తెలియక కొనుగోలుదారులు ఆందోళన పడుతున్నారన్నారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుంటూ గత టీడీపీ ప్రభుత్వం అక్కడ టిడ్కో ఆధ్వర్యంలో పేదలకోసం ఇళ్లు నిర్మిస్తే వాటిని వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చివేసిందన్నారు. దీంతో వైస్‌చైర్మన్ బంగారురెడ్డి మాట్లాడుతూ టిడ్కో లబ్ధిదారులకు వారు కట్టిన డబ్బులు ఇచ్చి ఆ స్థలాల్లో వైసీపీ ప్రభుత్వం ఎంఐజీ లేఅవుట్‌లు వేసి విక్రయించిందన్నారు. అక్కడ నిర్మాణ దశలో ఆగిపోయిన టిడ్కో ఇళ్లను ప్రభుత్వం కూల్చిందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ టీడీపీ ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్లు పేదలకు దక్కకూడదనే వైసీపీ ప్రభుత్వం ఇంత దుర్మార్గానికి ఒడికట్టిందన్నారు. దీంతో బంగారురెడ్డి పేదలకు 24 వేల ఇళ్లు జగనన్న కాలనీల పేర నిర్మించామని తెలపగా ఎక్కడ నిర్మించారో చూపాలని టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి ప్రశ్నించారు. దీంతో మాటామాటా పెరిగి ఉద్రిక్తతకు దారితీసింది. ఇది రగడగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని గొడవ జరగకుండా చూశారు. ఎమ్మెల్యే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటే టిడ్కో అధికారులను కూడా సభకు రప్పించాలని చెప్పి చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు, వైసీపీ కౌన్సిలర్లు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే కౌన్సిల్ సమావేశాన్ని కొనసాగించారు. ఫోర్జరీ సంతకాలతో ఆర్పీలు కోట్ల రూపాయల రుణాలు తీసుకున్న స్కాంపై విచారణ జరుగుతోందని సీఎంఎం మహాలక్ష్మి తెలిపారు. హౌసింగ్‌లో జరిగిన స్కాంపై విచారణ చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.



వైస్ చైర్మన్ బంగారురెడ్డి, కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి మధ్య వాగ్వాదం

# పోలీసు హ్యాండ్సప్

● వైసీపీకి సరెండర్

● 20రోజులైనా ఎంపీ అవినాశ్ పీఏ రాఘవరెడ్డిని అరెస్టు చేయని వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఇక్కడి అధికార యంత్రాంగమంతా వన్‌సైడ్‌గా ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ఇక్కడ అదే పరిస్థితి ఉంది. ఐదేళ్లు జగన్ హయాంలో వన్‌సైడ్‌గా వ్యవహరించిన పోలీసు యంత్రాంగమే ఇప్పటికీ అదే మాదిరి వ్యవహరిస్తోంది. ఎలాగంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత ఇతరులపై వైసీపీ సోషల్ మీడియాలో నీచంగా పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డిని మాత్రమే అరెస్టు చేశారు. ఇందులో కీలకమైన సజ్జల భార్గవరెడ్డి, జగన్‌కు వరుసకు అల్లుడైన అర్జునరెడ్డి ఇంకా బయటే ఉన్నారు. జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిలపై అసభ్యకరంగా పెట్టిన పోస్టుల కంటెంట్ తనకు ఇచ్చింది ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి అని వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డి వాంగ్మూలం ఇచ్చినా.. 20 రోజులుగా రాఘవరెడ్డి దర్జాగా బయటే ఉన్నారంటే జిల్లా పోలీసు వ్యవస్థ అంతా వైసీపీకి హ్యాండ్సప్ అయినట్లుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా కడపకు రెగ్యులర్ ఎస్పీ లేరు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఉదయం రాయచోటి, సాయంత్రం కడపలో అన్నట్లు తయారైంది. అంతే పోలీసు యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అడిగే నాథుడే లేడు.

వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన అధికార యంత్రాంగం, వైసీపీ సోషల్ మీడియా సైకోలు అంతా ఇక్కడివారే. ఇక్కడ పవర్‌ఫుల్ అధికారులు ఉండాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ కీలకమైన పోలీసు శాఖలో ఇక్కడ అంతా వైసీపీ ఫ్యాన్సే ఉన్నారు. గవర్నమెంటు వచ్చి చాలా నెలలు అయినా ప్రతి కదలిక వైసీపీ వారికి తెలిసిపోతోంది. అవినాష్ పీఏ 20 రోజులుగా దొరకకపోవడానికి కారణం జస్ట్ పోలీసులు హ్యాండ్సప్ అనే ప్రచారం ఉంది. రెండురోజుల క్రితం డీఐజీ కోయ ప్రవీణ్ మీటింగ్ పెట్టుకున్నారంటారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా సైకోల అరెస్టుపై తీవ్రంగా స్పందించినట్లు చెబుతారు. ఇందులో భాగంగా శనివారం కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి భారీగా సీఐలను బదిలీ చేశారని అంటున్నారు. పులివెందులలో పనిచేస్తున్న సీఐ జీవన్ గంగానాథ్‌బాబు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయనను బదిలీ చేశారని సమాచారం. ఆయన స్థానంలో టి.నరసింహులును నియమించారు. ఇక ఎస్పీకి సంబంధించి ఓ కానిస్టేబులును బదిలీ చేశారు.

### ఎస్పీ కావలెను

రాష్ట్రంలో కడప చాలా ముఖ్యమైన జిల్లా. ఇలాంటి చోట ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సీఎం చంద్రబాబు లక్ష్యాల మేరకు గంజాయి, పేకాట, ఇతరత్రా అక్రమాలపై ఉక్కుపాదం మోపారు. తప్పుడు కేసులు నమోదుకాకుండా చట్టప్రకారం వ్యవహరించారు. అయితే ఆయన వ్యవహారం టీడీపీ నేతలకు నచ్చలేదు. ఇంతలో వైసీపీ సోషల్ మీడియా సైకో వర్రా అరెస్టు సమయంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాలతో ఎస్పీని ఆకస్మికంగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఎస్పీగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుకు బాధ్యతలు అప్పగించారు. కీలకమైన కడపకు నాలుగు వారాలు దాటినా ప్రభుత్వం ఇంకా రెగ్యులర్ ఎస్పీని నియమించలేదు. వైసీపీ హయాంలో ఎలా అయితే భూకబ్జాలు, మట్టి ఇసక దందాలు నడిచేవో.. ఇప్పటికీ అవి కొనసాగుతూనే ఉన్నాయి. వైసీపీలో ఉన్న రౌడీలే ఇప్పటికీ టీడీపీలో ఉన్నారు. ఇక పోలీస్టేషనులో ఏం జరిగినా సమాచారం వైసీపీకి అందుతుంది. నాలుగు వారాలుగా రెగ్యులర్ ఎస్పీ లేకపోవడంతో పాత బ్యాచ్ అంతా ఆడిందే ఆటగా ఉందంటున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ ఎస్పీని నియమించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

- చామంతి రూ.100
- రైతులకు వచ్చేది తక్కువే...
- దళారులదే రాజ్యం..
- ప్రతి ఏటా ఏదో ఒక గడ్డు పరిస్థితి

# ధరలున్నా దగాయేనా..!

వాల్మీకిపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూల సాగుతో కష్టాల నుంచి గట్టెక్కవచ్చని ఎంతో ఆశతో సాగు చేసిన రైతు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాడు. మార్కెట్‌లో పూల ధరలు బాగా ఉన్న దళారులే సంపాదిస్తున్నారు కానీ రైతుకు మాత్రం లాభాలు రావడం లేదని వాపోతున్నారు. వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ప్రతి ఏటా వందెకరాలకు పైగా సాగు చేసే పూల తోటలు నేడు సగానికి తగ్గాయి. మండలంలో దాదాపు 50 ఎకరాలలో చామంతి పూల తోటలు సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో చామంతి పూలకు బాగా గిరాకీ ఉన్నా ధరలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అయ్యావారిపల్లె గ్రామానికి చెందిన రైతు నరసింహులు ఎకరం పొలంలో రూ.లక్షకు పైగా పెట్టుబడితో చామంతి పూల తోటను సాగు చేశాడు. అలాగే వాల్మీకిపురానికి చెందిన శేషాద్రి తులసీరామ్ అనే రైతు అరెకరం పొలంలో రూ.60 వేలు పెట్టుబడితో పింక్, వైట్ చామంతి పూల తోటలు సాగు చేశాడు. మండలంలో సాగు చేసే చామంతి పూలకు బయటి మార్కెట్‌లకు ధరలు బాగానే ఉన్నా రైతుకు మాత్రం దాని ఫలితం దక్కడం లేదు. వాల్మీకిపురం నుంచి మదనపల్లె, తిరుపతి, నెల్లూరు, విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వారం రోజుల క్రితం వరకు పండుగల నేపథ్యంలో చామంతి పూలకు మంచి గిరాకీ ఉండేది. ప్రస్తుతం బయటి ప్రాంతాల మార్కెట్లలో చామంతి పూలు కిలో రూ.100 వరకు పలుకుతున్నాయి. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న పూల ధరలు అధిక లాభాలు గడించలేకపోయినా అలా ఇలా పెట్టుబడులను రాబట్టుకోగలుగుతున్నామని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే ఏనాడు కూడా రైతులు మంచి లాభాలను గడించిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. రైతుల పంటలను మార్కెట్‌లకు చేరవేసే దశలో దళారుల రాజ్యం ఎక్కువవుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లలో ఉండే ధరలలో కనీసం 70 శాతం రైతులకు చేరితే తమ శ్రమకు తగ్గ ఫలితం చూడగలుగుతామని చెబుతున్నారు.



వాల్మీకిపురం సమీపంలో సాగు చేసిన వైట్, పింక్ చామంతి పూలతోటలు



### పెట్టుబడులు రాబట్టుకుంటున్నాం..



రెండేళ్ల కాలంలో చామంతి పూల తోటల సాగులో పూర్తిగా నష్టాలనే చూశాం. ఈ ఏడాది కష్టకాలంలో శ్రమించి సాగు చేసిన చామంతి పూలకు కాసింత ఊరటనిచ్చే ధరలే ఉన్నాయి. పంటలకు అధిక లాభాలు రాకపోయినా రైతు పెట్టిన పెట్టుబడులు రాబట్టుకోవడం కాసింత సంతోషమే. రైతులు పండించే పంటలకు పూర్తి మద్దతు ధరలు పలకడం, ఆశించిన ఫలితాలు వస్తే అంతకన్నా సంతోషం ఇంకేముంటుంది. మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న ధరలు ఇలాగే అయినా కొనసాగితే బాగుపడతాం.

-నరసింహులు, రైతు, అయ్యావారిపల్లె

### లాభాలు లేవు



నేటి గడ్డు పరిస్థితులలో రైతులు పండించే పంటలకు ఆశించే స్థాయిలో లాభాలను చూడలేకపోతున్నాం. ఈ ఏడాది తొలిసారి అరెకరంలో చామంతి రకాల పూల తోటలు సాగు చేశా. కూలీలు భారం అయినప్పటికీ పెట్టిన పెట్టుబడులు అయినా వస్తాయన్న ఆశతో ఉన్నాం. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడే వ్యవసాయంలో ముందుకెళ్లగలం. ప్రభుత్వం కూడా దళారుల పాత్రపై దృష్టి పెట్టాలి.

-శేషాద్రి తులసీరామ్, రైతు, వాల్మీకిపురం.

కష్టకాలంలో సాగు చేసిన పంట చేతికొచ్చే సమయాన కోత కూలీలు భారంగా మారుతున్నాయి. వీటిని అధిగమించాలంటే రైతు సాగు చేసే పంటలకు మంచి ధరలు పలకాలి.

## పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి మున్సిపాలిటీ పరిధిలోని రాయుడుకాలనీలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ లక్ష్యసాధన దిశగా ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులకు అందజేసి వారికి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించడం జరిగిందన్నారు. కుల, మత పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అర్హులకు అందజేయడం జరుగుతోందన్నారు. గతంలో పింఛన్‌దారులు 1వ తేదీ పింఛన్ తీసుకోకపోతే ఆ పింఛన్ క్యాన్సిల్ చేసేవారని, నేడు ప్రభుత్వం రెండు, మూడు నెలలైనా లబ్ధిదారులకు పింఛన్ మొత్తం కలిపి ఇవ్వడం జరుగుతోందన్నారు. అలాగే అభివృద్ధిలో వెనుకబడి ఉన్న రాయచోటి ప్రాంతాన్ని నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రామాలయంలో పూజలు చేసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

## యువజనోత్సవం విజేతలు వీరే

**బహుమతులు ప్రదానం చేసిన స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్**



బహుమతులు అందజేస్తున్న రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శంకర్

రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ సూచించారు. బిట్స్ కాలేజీలో శనివారం జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల విజేతలను ఆయన అభినందించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్‌లో పెయింటింగ్ విభాగంలో మొదటి బహుమతి వెన్నెల, రెండవ బహుమతి కేబీ స్రవంతి, మూడవ బహుమతి కె.రెడ్డిఇషాంత్, కవిత్వం విభాగంలో మొదటి బహుమతి పి.సమీరాఖానం, రెండవ బహుమతి కె.కార్తీక, మూడవ బహుమతి వి.నిఖిత సాధించారు. అలాగే మొబైల్ ఫొటోగ్రఫీ విభాగంలో మొదటి బహుమతి సి.సాయికిరణ్‌రెడ్డి, రెండవ బహుమతి పి.గౌతమి, మూడవ బహుమతి ఎస్.రితికారెడ్డి, సైన్స్ ఎగ్జిబిషన్ గ్రూప్ విభాగంలో మొదటి బహుమతి రూప టీం, రెండవ బహుమతి లక్ష్మీనాథ్‌శర్మ టీం, మూడవ బహుమతి సి.తరుణ్‌కుమార్ గౌడ్ టీం సాధించింది. వ్యక్తిగత విభాగంలో మొదటి బహుమతి కేవీఎంఎస్ యశ్వంత్, రెండవ బహుమతి సిద్దేశ్వర్, మూడవ బహుమతి గురుచరణ్ రెడ్డి, కల్చరల్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి మదనపల్లెకు చెందిన జ్ఞానాంబిక కాలేజీ లంబాడీ టీం, రెండవ బహుమతి జ్ఞానాంబిక కాలేజీకి చెందిన కోయ టీం, మూడవ బహుమతి రాయచోటి మోడల్ కాలేజీకి చెందిన వైశాలీ టీం గెలుపొందింది. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపిక, సర్టిఫికెట్ ప్రదానం చేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ అందజేశారు. ముగింపు కార్యక్రమంలో యువ అధికారి మణికంఠ, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, భాస్కర్ కాలేజ్ కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ మురళీనాయక్, పెద్దఎత్తున యువత స్టెప్ సిబ్బంది, నెహ్రూ యువకేంద్ర వలంటీర్లు పాల్గొన్నారు.

## బైకుల దొంగ అరెస్టు

**ఎనిమిది బైకులు స్వాధీనం**




బైకుల దొంగను అరెస్టు చూపుతున్న వన్‌టౌన్ పోలీసులు

మదనపల్లె అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ పరిసర ప్రాంతాల్లో బైకుల దొంగతనానికి పాల్పడిన దొంగను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఎరిసావల్లి తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల వివరాలు వెల్లడించారు. మదనపల్లె పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన సయ్యద్ అబ్దుల్ (48) స్థానిక ఉర్దూ స్కూల్ ఎదుట చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు.

దీంతో పాటు అతడు బైకుల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే అతడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 2.50 లక్షల విలువ చేసే 8 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఇందులో వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు పాల్గొన్నారు.

### జాతీయ పోటీలకు ఎంపిక




గాలివీడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎగువ గొట్టివీడు జిల్లా పరిషత్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి.బాలగంగాధర్ నాయుడు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14 విభాగంలో పూతలపట్టులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. .


### నీలకంఠ్రావుపేట విద్యార్థి...



రామాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి నాగచైతన్య జాతీయ త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. చిత్తూరు జిల్లా పూతలపట్టులో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్ అండర్-14 బాలుర విభాగంలో మంచి ప్రతిభ కనబరచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ తెలిపారు.

## ఆ చర్చిది 137 ఏళ్ల ఘన చరిత్ర







137 సంవత్సరాల పురాతన పరిపేతురు, పరిపౌలు చర్చి - ఇటుకలతో నిర్మించిన చర్చి ముందుభాగం - చర్చి లోపల భాగం

- **2, 3 తేదీల్లో పరిపేతురు, పరిపౌలు చర్చి వార్షికోత్సవం**

కలసపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కలసపాడు సగిలేరు నది ఒడ్డున 19వ శతాబ్దంలో ఆంగ్లేయులు నిర్మించిన పురాతన చర్చికి వచ్చిన కోరికలు కోరుకుంటే అవి తీరుతాయని భక్తుల నమ్మకం. 137 సంవత్సరాల చరిత్ర కలిగిన చర్చి వార్షికోత్సవం డిసెంబరు 2, 3వ తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. వేలాదిమంది క్రైస్తవులు హాజరయ్యే తిరుణాలకు చర్చి కమిటీ ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.

**19వ శతాబ్దంలో చర్చి నిర్మాణం..**

19వ శతాబ్దంలో ఇంగ్లాండు నుంచి ఎస్పీజీ మిషనరీలు కలసపాడుకు వచ్చారు. పేద పిల్లల కోసం ఎస్‌పీజీ పాఠశాల ఏర్పాటు చేసి 1884వ సంవత్సరం రెవరెండ్ క్యానమ్ ఆర్థర్ ఇన్‌మన్ చర్చి నిర్మాణానికి పునాది వేశారు. 1887 నాటికి పూర్తి చేసి అప్పటి చెన్నపట్నం నాలుగో బిషప్ రైట్ రెవరెండ్ హెడ్రిక్‌చే ప్రతిష్ఠ నిర్వహించారు. చర్చికి పరిపేతురు, పరిపౌలు ఆలయంగా నామకరణం చేశారు. అప్పటి నుంచి ప్రతి యేటా డిసెంబరు 2, 3 తేదీల్లో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

**అద్భుత నిర్మాణం..**

కలసపాడు చర్చి నిర్మాణం అద్భుతంగా జరిగింది. స్థానికంగా దొరికే బంకమట్టితో ఇటుకలు తయారు చేసి వాటిని సగిలేరు నదిలో నానబెట్టారు. గట్టిగా ఉన్న ఇటుకలతో పాటు బెల్లం, కోడిగుడ్లు, సున్నం గచ్చులతో యు ఆకారంలో శిలువ గుర్తు వచ్చే విధంగా చర్చి నిర్మాణం చేపట్టారు. చర్చికి ఇరువైపులా వరండాపై చెక్కుచెదరని టేకు దూలాలు ఏర్పాటు చేసి మట్టితో తయారు చేసిన పెంకులను పైకప్పుగా వినియోగించారు. 137 సంవత్సరాలైనా ఏమాత్రం చెక్కుచెదరక భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

**భారీగా ఏర్పాట్లు...**

చర్చి తిరుణాలకు దక్షిణ భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది హాజరుకానున్నారు. అంతేకాక ఈ తిరుణాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తల నీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మైదుకూరు, బద్వేలు, గిద్దలూరు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయనుంది.

**కార్యక్రమాలు..**

2వ తేదీ సాయంత్రం విదేశాల నుంచి వచ్చే అతిథులతో పాటు నంద్యాల డయాసిస్ బిషప్ ప్రముఖులకు స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఊరేగింపు నిర్వహించనున్నారు. 8.30 గంటలకు దీపారాధన, 9.30కు కానుకలు సమర్పించడం, 11.30 గంటలకు ధనవంతుడు-బీదలాజరు నాటకంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

3వ తేదీ ఉదయం 4 గంటలకు ఆరాధన, 7 గంటలకు గుడి ప్రదర్శన, 9 గంటలకు బాప్తిష్మములు, సాయంత్రం 4 గంటలకు ప్రతిష్ఠ ప్రత్యేక పండుగ కార్యక్రమం నిర్వహించనున్నారు.

## గండికోటలో గొడవ .. కారు అద్దాలు ధ్వంసం

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు హైదరాబాద్ వాసి శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు అందించిన వివరాల్లోకెళితే... గండికోట చూసేందుకు హైదరాబాదు నుంచి కారులో నలుగురు వచ్చారు. వారు శనివారం ఉదయం గండికోటలోని జుమ్మా మసీదు, ధాన్యాగారం, లోయ, మాధవరాయస్వామి దేవాలయం చూశారు. లోయకు సమీపంలో అనుమతి లేకుండా వేసిన లేని టెంట్ల వద్ద కొందరు మాటా మాట పెరిగి గొడవకు దిగారు. అయితే గొడవపడిన వారు సమీపంలో ఉన్న నల్లకారును చూసి కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితులు వివరించారు. కాగా గొడవతో అసలు సంబంధంలేని హైదరాబాదీల కారు అద్దాలు ధ్వంసం చేయడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గండికోటలో అనధికారిక టెంట్లు వేయడం తగదని వారు ఆరోపించారు. ఇతరులకు గొడవ జరిగితే గొడవకు సంబంధంలేని తమ కారు అద్దాలు ధ్వంసం చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గొడవ విషయమై జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆంధ్రజ్యోతికి వివరణ ఇస్తూ అనధికారికంగా వేసిన టెంట్లపై, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే కారు అద్దాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

**ఏపీఆర్‌జేసీ రాష్ట్ర స్థాయి పోటీల్లో**

## జిల్లా క్రీడాకారుల ప్రతిభ

పెదవేగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీఆర్‌జేసీ) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. రాష్ట్రంలోని నాలుగు జోన్ల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ పరిధిలో విశేష ప్రతిభతో పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన విజేతలు తదుపరి జరిగే జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికవుతారని పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కబడ్డీలో లక్కిరెడ్డిపల్లి బాలికల జట్టు, జోన్-4, ప్రథమ, భీమిలి జట్టు జోన్-1 ద్వితీయస్థానం సాధించారు. అలాగే బాలికల కబడ్డీ సీనియర్స్ విభాగంలో లక్కిరెడ్డిపల్లి జట్టు జోన్-4 ప్రథమ, సంఘం జట్టు జోన్-3 ద్వితీయస్థానం సాధించారు.

## విజయవంతంగా ముగిసిన స్పోర్ట్స్ మీట్

- టగ్ ఆఫ్ వార్ విజేత ఎస్పీ జట్టు
- విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్స్ అందజేసిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



పోలీస్ స్పోర్ట్స్ మీట్స్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో మూడు రోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్, స్పోర్ట్స్ మీట్ శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ వేడుకలకు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూడు రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లను ఎస్పీ ఆసక్తిగా తిలకించారు. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ జట్టు విజయం సాధించింది. టగ్ ఆఫ్ వార్‌లో ఎస్పీ కూడా పాల్గొని క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం మూడు పోలీసు సబ్ డివిజన్లు, రాయచోటి, మదనపల్లె, రాజంపేట, ఆర్మ్‌డ్ రిజర్వు నుంచి పాల్గొన్న పోలీసు క్రీడాకారులు ముగింపు మార్చ్ ఫాస్ట్ చేసి ఎస్పీకి గౌరవ వందనం చేశారు. పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో వ్యక్తిగత ఛాంపియన్‌గా ఏఆర్‌పీసీ శ్రీనునాయక్ నిలిచారు. ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు జట్టు నిలిచింది. స్పోర్ట్స్ మీట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు, విజేతలకు ఎస్పీ ట్రోఫీలు, మెడల్, మెమెంటోలు, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో ఉత్సాహంగా జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిరోజు చురుకుగా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, క్రీడా స్ఫూర్తితో ఓటమిని కూడా ఆనందంగా స్వీకరించినప్పుడే జీవితంలో కూడా ఒడిదుడుకులను ఎదుర్కోగలమన్నారు. స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు, పోలీసు సిబ్బందికి ఎస్పీ మెమెంటోలను అందజేసి అభినందించారు. క్రీడల ముగింపు వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్పీతో పాటు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, మదనపల్లె డీఎస్పీ డి.కొండయ్యనాయుడు, రాజంపేట డీఎస్పీ ఎన్.సుధాకర్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు, వైద్య బృందం పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో సీఐల బదిలీ

కడప(క్రైం),నవంబరు(ఆంధ్రజ్యోతి)30: ఉమ్మడి కడప జిల్లాలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారు తక్షణమే కేటాయించిన స్టేషన్‌లలో రిపోర్టు చేశాయలంటూ ఆదేశాలు జారీ చేశారు.

| సీఐ పేరు | పనిచేస్తున్న స్టేషన్ | బదిలీ అయిన స్టేషన్ |
|---|---|---|
| ఎ. చాన్‌బాష | వీఆర్ అన్నమయ్య | డీటీసీ నంద్యాల |
| జి.ఓబులేష్ | ఆత్మకూరు నంద్యాల | కడప చిన్నచౌకు |
| క్రిష్ణంరాజు నాయక్ | ఒంటిమిట్ట | వీఆర్ కడప |
| నాగరాజు | ఆర్‌కే వ్యాలీ | సోషియల్ మీడియా, సైబర్ సెల్ కడప |
| టి.బాబు | వీఆర్ కడప | ఒంటిమిట్ట |
| ఉలసయ్య | వీఆర్ చిత్తూరు | ఆర్‌కే వ్యాలీ |
| వెంకట కుమార్ | ఎస్‌బీ-1 కడప | వీఆర్ కడప |
| టి.రెడ్డప్ప | వీఆర్ కడప | ఎస్‌బీ-1కడప |
| సురేంద్రనాథ్ రెడ్డి | వీఆర్ అన్నమయ్య | ఎస్‌బీ-2 కడప |
| ఈదురు బాష | వీఆర్ కడప | ఎహెచ్‌టీయూ కడప |
| నరసింహులు | ఆర్‌ఎస్‌ఎఎస్‌టీఎఫ్, కడప | పులివెందుల |
| రాజారెడ్డి | బి.కొత్తకోట అన్నమయ్య | ఎస్‌బీ-3 అన్నమయ్య |
| జీవన్ గంగనాద్‌బాబు | పులివెందుల | బి.కొత్తకోట అన్నమయ్య |
| టి.మధు | వీఆర్ అన్నమయ్య | ఆర్‌ఎస్‌ఎఎస్‌టీఎఫ్, అన్నమయ్య |
| టి.వి.సత్యనారాయణ | ఎస్‌బీ-1అన్నమయ్య | వీఆర్ అన్నమయ్య |
| రాజా రమేష్ | ఎస్‌బీ-3అన్నమయ్య | ఎస్‌బీ-1అన్నమయ్య |
| జె.శంకరయ్య | డీసీఆర్‌బీ అన్నమయ్య | వీఆర్ అన్నమయ్య |
| తులసీరామ్ | వీఆర్ అనంతపురం | డీసీఆర్‌బీ అన్నమయ్య |

## నిర్మల ఫార్మశీకి న్యాక్ అనుబంధ గుర్తింపు



ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడపనగరం నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మశీకి ప్రతిష్టాత్మక న్యాక్ అనుబంధ గుర్తింపు వచ్చింది. 2024 విద్యాసంవత్సరం నుంచి 2029 విద్యాసంవత్సరం వరకు ఈ గుర్తింపు వర్తిస్తుందన్నారు. గత జూన్‌లో నాక్ సంస్థ ముగ్గురు నిపుణుల బృందాన్ని పంపించి ఐదేళ్లలో విద్యావిధానం, అడ్మిషన్లు, ఫార్మశీరంగంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన క్యాంపస్ సెలక్షన్లు సైంటిఫిక్ సెమినార్లు వర్క్‌షాపులు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, మానసిక శారీరక దృఢత్వానికి అవసరమైన యోగా వివిధ ఆటల పోటీల నిర్వహణ, ఇతర కళాశాలల ఫార్మశీ కంపెనీలతో కలిసి పనిచేసే అవసరమైన అనుబంధ పత్రాలు వీటిపై క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి చెంది న్యాక్ అనుబంధ గుర్తింపు క్రించింది. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం బోధన బోధనేతర సిబ్బంది కృషి గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఒక ప్రశంసాపత్రాన్ని పంపిందని కళాశాల చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. అనుబంధ గుర్తింపు తీసుకురావడానికి కృషి చేసిన డాక్టర్ మోహనకుమార్, న్యాక్ కోఆర్డినేటరు స్రవంతి, ఉపాధ్యాయులను అభినందించారు.

## విదేశీ విద్యపై అవగాహనసదస్సు


విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న భూపేంద్ర

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులకు శనివారం ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ కార్యాలయంలో హైదరాబాదుకు చెందిన అబాకర్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సదస్సుకు జిల్లా వ్యాప్తంగా 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. నిర్వాహకులు విదేశాల్లో చదువు, కెరీర్, భవిష్యత్తు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విదేశాల్లో ఏయే యూనివర్శిటీల్లో ఏయే కోర్సులు అందుబాటులో ఉన్నాయి, మంచి యూనివర్శిటీలు, రాయాల్సిన పరీక్షలు, వీసా, రుణ సౌకర్యం, సమర్పించాల్సిన డాక్యుమెంట్లపై విద్యార్థులకు వివరించారు. అబాకర్స్ ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ అడ్వైజర్స్ డైరెక్టర్ భూపేంద్ర మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ప్రముఖ యూనివర్శిటీల్లో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ వంటి కోర్సుల్లో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఆయా యూనివర్శిటీల్లో చదవడంతో మంచి అవకాశాలు లభిస్తాయని, అలాగే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసి యూనివర్శిటీ ఫీజులను సొంతంగా చెల్లించుకోవచ్చన్నారు. పోస్ట్ స్టడీ వర్క్ వీసా ద్వారా రెండు మూడేళ్లు ఆ దేశాల్లోనే పనిచేసుకోవచ్చని సూచించారు.

## ప్రవచన కర్త పుష్పగిరి క్షేత్ర సందర్శన


ప్రవచనకర్త శ్రీనివాసులును సత్కరిస్తున్న దేవస్థానం సభ్యులు

వల్లూరు/ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచన కర్త నండూరి శ్రీనివాస్ శనివారం పుష్పగిరి క్షేత్రంలోని చెన్నకేశవస్వామి వారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం ముగుస్తుండడంతో ఆలయంలో మహిళలు కార్తీక దీపాన్ని వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రవచనకర్త శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారి ద్వారా స్వామివారి చరిత్రను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి తదితరులున్నారు.

## వర్షం కారణంగా ఆగిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ నవంబరు30, (ఆంధ్రజ్యోతి): ఏసీఏ మెన్ అండ ర్- 23 ఇంటర్ జోనల్ వన్‌డే క్రికెట్ మ్యాచ్‌లు శనివారం వ ర్షం కారణంగా ఆట మధ్యలోనే నిలిచిపోయాయి. వివరాలిలా...

వైఎస్ రాజారెడ్డి - ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈస్ట్ గోదావరి- రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌ త్‌జోన్ బ్యాటింగ్‌కు దిగి 33 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 234 పరుగుల స్కోర్ సాధించింది. కాగా వర్షం రాకతో ఆట నిలిచిపోయింది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో ప్రకాశం- అనంతపురం జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 41.3 ఓవర్లలో 239 పరుగుల స్కోర్ సాధించి ఆలౌట్ అయింది. తర్వాత వర్షం కారణంగా ఆట నిలిచిపోయే సమయానికి ప్రకా శం జట్టు 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. కేఓఆర్‌ఎం మైదానంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్- రెస్ట్ ఆఫ్ నార్త్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన రెస్ట్‌ఆఫ్ సెంట్రల్ జట్టు బ్యాటింగ్‌కు దిగి 45 ఓవర్లలో 8 వికెట్లు కోల్పో యి 186 పరుగులు చేసింది. ఇందులో వి. వర్ధన్ 44 పరుగులు, రాజు 42 పరుగులు చేశారు. అనంతరం వర్షం రాకతో రెస్ట్ ఆఫ్ నార్త్ జట్టు మ్యాచ్ సాగలేదు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామిపై కేసు నమోదు

బద్వేలుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామిపై పలుసెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె పంచాయితీ 1754/2 సర్వేనెంబర్‌లో జరిగిన భూ అవకతవకలపై లబ్ధిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

## భర్త మృతి చెందిన మూడు రోజులకే...

### ప్రమాద వశాత్తు భార్య నాగసుధ మృతి

లింగాల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భర్త నాగరాజు మృతి చెందిన మూడు రోజులకే భార్య నాగసుధ(36) మృతి చెందింది. లింగాల ఎస్‌ఐ మధు సూదన్‌రావ్ అందించిన వివరాల్లోకెళితే... పార్నపల్లె వాసి సాకే నాగరాజు నవంబరు 26న మృతి చెందాడు. అయితే మృతుడి భార్య నాగసుధ భర్త సమాధి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పి ప్రమాద వశాత్తూ కింద పడింది. దీంతో నాగసుధకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

# వెంటాడిన మృత్యువు

### బైక్, ట్యాంకర్ ఢీ - లెక్చరర్ దుర్మరణం


మల్లికార్జున రాజు మృతదేహం - (ఇన్‌సెట్‌లో ఫైల్‌ఫొటో)

ఎర్రగుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మరో 15నిమిషాల్లో గమ్యాన్ని చేరబోతుండగా మృత్యువు సిమెంట్ ట్యాంకర్ రూపంలో వెంటాడి తన ఒడికి చేర్చుకుందని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. లెక్చరర్ డాక్టర్ బి.మల్లికార్జునరాజు వెళుతున్న బైక్‌ను ట్యాంకర్ ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వివరాల్లోకెళ్లితే....

ప్రొద్దుటూరు మండలం శంకరాపురం వాసి డాక్టర్ బి.మల్లికార్జునరాజు ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడేళ్లుగా తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ప్రొద్దుటూరులో కాపురం ఉంటూ ఎర్రగుంట్లలోని కళాశాలకు వచ్చి విధులు నిర్వహించి వెళ్లేవారు. శనివారం ఉదయం కాలేజీకి మోటార్‌బైక్‌లో బయలుదేరాడు. మరో 10నిమిషాల్లో గమ్యాన్ని చేరుకునే సమయంలో ప్రొద్దుటూరు పెన్నా వంతెన దిగగానే పోట్లదుర్తి నడిగడ్డ శివాలయం మలుపు వద్ద అదేవైపు నుంచి వస్తున్న ట్యాంకర్ ఢీకొంది. దీంతో మల్లికార్జునరాజు ట్యాంకర్ కింద పడడంతో ఆయన మెడపై టైర్లు ఎక్కడంతో టైర్ల మధ్యలో ఇరుక్కుపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎర్రగుంట్ల సీఐ నరేష్ బాబు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

### దిగ్భ్రాంతికి లోనైన సిబ్బంది

ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ మల్లికార్జునరాజు సంఘటలన తీవ్రదిగ్భ్రాంతికి లోను చేసిందని ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. సిబ్బందితో కలిసి సంఘటనా స్థలిలో మృతుడి కుటుంబాన్ని ఓదార్చారు. తెలుగు లెక్చరర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా హుషారుగా ఉండేవారన్నారు. అందరిని ఆకట్టుకునే వారని, ఆయన మృతి తమకు తీవ్ర దుఃఖాన్ని మిగిల్చిందన్నారు. మల్లికార్జున అంత్యక్రియలు ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# బడి వైపు ఒక అడుగు : కలెక్టర్

కడప కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బడి వైపు ఒక అడుగు వేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌పై ఎంఈఓలు, ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యం ఉన్నపుడే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విద్యాభివృద్ధిలోనూ కీలక భాగస్వామి కావాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. పేదరికంలేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా విద్యా రంగంలో అనేక సంస్కరణలు పరిశీలించిన ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల మధ్య సంబంధాలు బలపరిస్తే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెంది 2047కు వికసిత ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని సంకల్పించారన్నారు. ఇందులో భాగంగానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (మెగాపీటీఎం)ని దేశంలోనే ఆదర్శవంతంగా నిర్వహించాలన్నారు. 2009లో భారత ప్రభుత్వం మన పిల్లల కోసం బాలల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం తీసుకు వచ్చారన్నారు. పాఠశాలల పనితీరు మెరుగుపరిచే క్రమంలో స్థానిక ప్రజల భాగస్వామ్యం కల్పించి పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, సిబ్బందితో సమావేశమై రూపొందించిన నమూనా ఆధారంగా పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించడానికి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, సమాజ సేవకులు దాతలను ఆహ్వానించేందుకు స్వయంగా విద్యార్థుల చేత ఆహ్వాన పత్రికలు సిద్ధం చేయించాలన్నారు. అవసరమైన కార్డులు, పెయింట్స్ కలర్ పెన్సిల్, స్కెచ్ పెన్స్‌ను స్కూల్ హెడ్ సమకూర్చాలన్నారు. జేసీ అదితి సింగ్, జడ్పీసీఈఓ ఓబులమ్మ, మున్సిపల్ కమిషనరు మనోజ్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

### ఇసుక పంపిణీ సజావుగా జరగాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ పక్రియ సజావుగా జరగాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇసుక బుకింగ్, సరఫరా, లభ్యత అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి డీఎల్ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పని చేసేలా చూసుకోవాలన్నారు. ఆర్డీఓలు తమ పరిధి స్టాక్ పాయింట్ రీచ్‌లను తనిఖీ చేసి సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. ఇసుక పంపిణీ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యావరణ అనుమతులు పొందిన సిద్దవటం మండలం గుండ్లమూల, చక్రాయపేటలోని గండికోవూరు, వీఎన్ పల్లి మండలం తంగేడు పల్లి మూడు సెమీ మెకనైజెడ్ ఇసుకరీచులకు నోటిఫికేషన్ ఇచ్చి టెండర్లు పిలిచారన్నారు. వీటికి 13 టెండర్లు అప్లికేషన్లు వచ్చాయన్నారు. ఇందులో 11 అర్హత పొందాయని తెలిపారు. తంగేడు పల్లి ఇసుక రీచ్‌ను అంకిరెడ్డి అండ్ సన్స్ రూ.24.50 బిడ్‌ధరకు దక్కించుకున్నారు. మిగతా రెండు రీచ్‌లకు తక్కువ ధరకు కోడ్ చేసిన వాటికి నోటీసులు ఇచ్చి డీఎల్ఎస్‌సీ కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

# మట్టి తవ్వకాల్లో బయల్పడిన గుహ?


శివాలయం వద్ద బయల్పడిన గుహ - లోపలి భాగం

కొండాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి సమీపంలో గుహలు ఉన్నట్లు స్థానికులు భావిస్తున్నారు. శివాలయం పక్కనే ఉన్న కొండలో ప్రొక్లెయిన్‌తో నేషనల్ హైవే పనులకు ఇటీవల బెలుకు మట్టి తీస్తుండగా కొండ వద్ద పెద్ద రంధ్రం బయటపడింది. అయితే లోపల కొద్ది దూరం వరకు వెళ్లి చూస్తే గుహ మాదిరి ఉందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఇవి నిజంగా గుహలేనా లేదా కొండకు పడిన ఒక పెద్ద రంధ్రమా అని సంబంధిత అధికారులు తేల్చాల్సి ఉంది. గుహ లాగా కనిపిస్తున్నా ధైర్యం చేసి ఎవరూ లోపలికి వెళ్లడం లేదు. చుట్టూ బెలుకు మట్టి ఉండడం, మధ్యలో పెద్ద పెద్ద బండలు ఉండడంతో లోపలికి వెళ్లడానికి బయపడుతున్నారు. కాగా గుహ బయట పడిందని తెలియడంతో చూసేందుకు పెద్ద ఎత్తున తరలి జనాలు వస్తున్నారు. శనివారం సాయంత్రం ఈ ప్రాంతాన్ని కొండాపురం తహసీల్దార్ గురప్ప సందర్శించారు. పరిశీలనకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

# ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

### నేటి ర్యాలీని విజయవంతం చేయాలి : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ, డీఎల్‌టీఓ డాక్టర్ సగిలి రవిబాబు పిలుపు నిచ్చారు. శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ డిసెంబరు1 ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. 'హక్కుల మార్గాన్ని అనుసరించండి - నా ఆరోగ్యం నా హక్కు' నినాదంతో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలన్నారు. దుర్వ్యసనాలకు బానిసలవడం, మత్తు పదార్థాలు,సెల్ ఫోన్లలో అశ్లీల చిత్రాలకు ఆకర్షితులై విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో సురక్షితం కాని సెక్స్ చేస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితులనుంచి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్పొరేషన్ నుంచి డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వరకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ చేస్తున్న ర్యాలీని విజయ వంతం చేయాలన్నారు. డిసెంబరు 1 నుంచి 15వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, మహిళా స్వయం సహాయక సంఘాల్లో హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రెండు నెలలకు ఒక సారి ట్రాన్స్ జండర్స్, మేల్ సెక్స్‌వర్కర్లకు నీకు తెలుసా? కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. హెచ్ఐవీ పాజిటివ్ ఉన్న వారికి ప్రభుత్వం ప్రతి నెల రూ.4 వేలు పింఛన్ అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమా మహేశ్వరకుమార్, ప్రోగ్రామ్ ఆఫీసరు, సిబ్బంది హజరయ్యారు.

# జీఎస్టీని హెడ్ ఆఫ్ అకౌంట్స్‌కు జమచేయాలి

### ● అభివృద్ధి పనుల్లో పురోగతి సాధించాలి : జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన


మాట్లాడుతున్న జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన

కడప రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో చేపట్టిన, చేపడుతున్న పనుల నుంచి తగ్గించిన జీఎస్టీ, క్యుసీ, ఎన్ఎసీ, లేబర్ సెస్ మొత్తాన్ని వెంటనే సంబంధిత శాఖల హెడ్‌ఆఫ్‌అకౌంట్స్‌కు జమచేయాలని జీఎస్టీ జాయింట్ కమిషనర్ జి. కల్పన, అసిస్టెంట్ కమిషనర్ ఎస్. రాజా నరసింహారెడ్డి, జడ్పీ సీఈఓ సి. ఓబులమ్మ పేర్కొన్నారు. శనివారం జడ్పీ సమావేశహాలులో ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాల ఎంపీడీఓలు, పరిపాలనా అధికారులకు జీఎస్టీ చెల్లింపు విధానం, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించిన వారు మాట్లాడుతూ జీఎస్టీ చెల్లింపుపై పూర్తిస్థాయి చర్యలను చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో తగిన పురోగతిని సాధించాలన్నారు. డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న క్యాటల్ సీడ్స్, సీసీ రోడ్ల పనులకు తగిన ప్రాధాన్యతను కల్పించాలన్నారు. పనిదినాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## 'ఎయిడ్స్ నిర్మూలనకు నడుం బిగిద్దాం'


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నిర్మూలనలో నడుం బిగిద్దామంటూ వైవీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రోగనిరోధకశక్తిని తగ్గిస్తుందన్నారు. రక్తమార్పిడి, కలుషిత సిరంజి, అనైతిక శృంగారంతో ఎయడ్స్‌వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటరామిరెడ్డి ప్రొఫెసరు క్రిష్ణారావు,డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు వెంకటరమణ, సుమిత్ర, డాక్టర్ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

సింహాద్రిపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ పి. ఖైరున్నీసా మెడలో బంగారు గొలుసు దుండగులు లాక్కెల్లినట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి సమాచారం మేరకు ఖైరున్నీసా ముద్దనూరు నుంచి రోజూ కళాశాలకు వచ్చి సాయంత్రం ప్రొద్దుటూరు బస్సుకు వెళ్తుండేది. ఈ నేపథ్యంలో శనివారం విధులు పూర్తి చేసుకుని బస్సు కోసం విద్యుత్ సబ్-స్టేషన్ వద్ద మెయిన్ రోడ్డుపై వేచి వుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వచ్చి ఆమె మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ప్రమాదవశాత్తు టీడీపీ కార్యకర్త మృతి



వీరపునాయునిపల్లె, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనిమెల టీడీపీ క్రియాశీలక కార్యకర్త బత్తల బ్రహ్మయ్య (37) ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఎస్ఐ మంజునాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం బ్రహ్మయ్య పిల్లవాడి పాఠశాలకు వెల్లాడు. అక్కడ పిల్లవాడి చెప్పులకోసం పాఠశాల మెట్లు ఎక్కుతుండగా జారి వెనక్కి పడ్డాడు. బలమైన గాయమవడంతో చికిత్స కోసం వేంపల్లెకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కూనవారిపల్లె పంచాయతీ సీతానగరం వద్ద విద్యుత్తు అర్త్‌వైరు తగిలి గేదె మృతిచెందింది. వివరాల్లోకి వెళ్లితే... కూనవారిపల్లె వాసి గోసుల యల్లారెడ్డి దినచర్యలో భాగంగా పశువులను మేపుకునేందుకు వెళుతుండగా రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సింగిల్‌పేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అర్త్‌వైర్‌కు విద్యుత్తు సరఫరా జరిగింది. ఈ తీగె గేదెకు తగిలి మృతి చెందుతుండగా ఏమైందని యజమాని పరిశీలించేందుకు తగలగా విద్యుత్తు షార్ట్‌సర్క్యూ ట్ జరిగి యజమాని కూడా కిందపడ్డాడు. విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యానికి గేదెను కోల్పోవాల్సి వచ్చిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

## నేడు శిల్పారామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రానున్న క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఈనెల 1వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు కడప నగరం రిమ్స్ సమీపంలోని శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై సెమీ క్రిస్మస్ వేడుకలు జరగనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. కావున నగర ప్రజలు తప్పక హాజరై సెమీ క్రిస్మస్ వేడుకలను దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

## చంద్రబాబు చిత్రపటానికి పెన్షనర్ల క్షీరాభిషేకం


కడప కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో సంఘం నాయకులు, సభ్యులు శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ పెన్షనర్లకు లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు.










# లోన్ నకిలీ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకూడదు

● బాధితులు సైబర్‌క్రైం టోల్ ఫ్రీ నెంబరు 1930ని సద్వినియోగం చేసుకోవాలి

కడప క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): లోన్ నకిలీ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకూడదని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి సూచించారు. సైబర్ క్రైం అవగాహన, నివారణలో భాగంగా శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల సైబర్ క్రైం మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఎక్కువగా మహిళలను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారన్నారు. నకిలీ లోన్ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయవద్దన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్‌డేట్, బ్యాంకు నుంచి కాల్స్ చేస్తున్నామని చెబుతుంటారని, ఇలాంటి కాల్స్ చేసే అపరిచితులను నమ్మవద్దని, ఓటీపీలు చెప్పవద్దన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీకి లేదా స్వయంగా సైబర్‌క్రైం.గౌ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేస్తే పోలీసు శాఖ వారు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంజన్నను దర్శించుకున్న బీటెక్ రవి

చక్రాయపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయ స్వామిని శనివారం టీడీపీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి, వేంపల్లె టీడీపీ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకుడు కేసరి ఆయనకు స్వాగతం పలికారు.

## రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పటేల్ రోడ్డు మిత్ర యోగా సెంటరులో డిసెంబరు 2 నుండి యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ రంగనాథరెడ్డి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.45 నుంచి 7 వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 నుంచి 10గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ సాయంత్రం 5.30 నుంచి 6.30 వరకు మూడో బ్యాచ్ ఉంటుందని వారు వివరించారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మన్సూరు అక్బర్ అన్నారు. శనివారం ఆ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 1న పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద తలపెట్టిన బ్లడ్‌క్యాంప్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నేడు బుక్‌లెట్ విడుదల

కడప(వినాయకనగర్), నవంబరు30(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎన్జీఓ భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు డిపార్టుమెంటల్ పరీక్షల బిట్స్ బుక్‌లెట్ విడుదల చేయనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌చంద్ర, అలీ ఖాన్ శనిఆరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ హాజరవుతారని తెలిపారు.

## ఉక్కు పరిశ్రమ నిర్మించాలి

కమలాపురం రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని విద్యార్థి సంఘం నాయకుడు ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం (పీఆర్‌ఎస్‌వైఎఫ్) ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు.

## 'అవినీతిపై చర్యలు తీసుకోవాలి'

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ బాయిస్ హైస్కూలులో జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో అవినీతిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్‌ఎన్ రాజా డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లావాసులను పక్కనబెట్టి తిరుపతికిచెందిన వారికి పోస్టు ఇవ్వడం దారుణమన్నారు.

## అజయ్‌కుమార్ వీణా సేవలు అభినందనీయం

కడప రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : సీనియర్ న్యాయవాది అజయ్‌కుమార్ వీణా సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి వెంకటేశ్వరరావు, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు కొనియాడారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో అజయ్‌కుమార్ వీణా చిత్రపటం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## వరి కోతలు వాయిదా వేసుకోవాలి

పెండ్లిమర్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్ష సూచనలు ఉన్నట్లు తెలుస్తుండటంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దు: ఎస్ఐ

కడప క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దని, నిబంధనలు మీరితే కేసులు నమోదు చేస్తామని కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ హెచ్చరించారు. సీఐ నాగార్జున ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠినంగా చర్యలు ఉంటాయన్నారు.

## 'మా స్థలాలు ఆక్రమిస్తే ఊరుకోం'

పులివెందుల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు ఈద్గా సమీపంలో తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లస్థలాలను ఆక్రమిస్తే ఊరుకునేది లేదని లబ్ధిదారులు హెచ్చరించారు. శనివారం వారికి ఇచ్చిన ప్లాట్ల వద్ద విలేకరులతో మాట్లాడారు. బేస్‌మట్టం ఏర్పాటు చేసుకున్నామని, ఇల్లు నిర్మించుకునేందుకు డబ్బులు లేక అలాగే ఉన్న స్థలాలను టీడీపీ నాయకులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారన్నారు.

**'కబ్జాలు చేసే అలవాటు వైసీపీ నాయకులదే'**

పార్నపల్లె రోడ్డుఈద్గా సమీపంలోని స్థలాలను టీడీపీ నాయకులు కబ్జా చేస్తున్నారని మహిళలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని టీడీపీ మైనార్టీ అధికార ప్రతినిధి మహబూబ్‌బాషా అన్నారు. తమ ఎకరా 20 సెంట్ల భూమికి సంబంధించి అన్ని ఆధారాలూ ఉన్నాయన్నారు. వైసీపీ నాయకులు తెరవెనుక ఉండి నాటకాలు ఆడిస్తున్నారన్నారు. పేద ప్రజలకు ఇచ్చిన స్థలాలు కబ్జా చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. కబ్జాలు చేసే అలవాటు వైసీపీ నాయకులకే ఉంటుందన్నారు.

## ఇంగ్లీషు పట్ల ఆసక్తి పెంచుకోవాలి: ప్రిన్సిపాల్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లీషు పట్ల విద్యార్థినులు ఆసక్తి పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషా తెలిపారు. శనివారం ఎస్‌కేఆర్‌అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో 'ఎంప్లాయిస్ ఎబిలిటీ స్కిల్ లీడ్ ఆఫ్ ది అవర్' అనే అంశంపై శిక్షణ ఏర్పాటు చేశారు.

## మాజీ కార్పొరేటర్ కుటుంబానికి అంజద్‌బాషా పరామర్శ


పవర్ అల్తాఫ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా తదితరులు

కడప ఎర్రముక్కపల్లెనవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ కార్పొరేటర్ పవర్ అల్తాఫ్ మామ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా శనివారం వారి గృహానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫి, షంషేర్, చాక్లెట్ ఆలీ అక్బర్, నాయకులు మున్నా, దాసరి శివ, ఇబ్రహీం, ఫయాజ్, మహబూబ్‌ఖాన్, సద్దాం హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ అనుబంధ విభాగాలకు మెటీరియల్ పంపిణీ


మెటీరియల్‌ను అందిస్తున్న వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేశ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా వైసీపీ అనుబంధ విభాగాలకు నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల పరిశీలకుడు, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేశ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. శనివారం నెల్లూరు వైసీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధనరెడ్డి సమక్షంలో అనుబంధ విభాగాల నేతలకు ఈ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 5లోపు అనుబంధ విభాగాల నియామక ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి: డీఈఓ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని డీఈఓ మీనాక్షి తెలిపారు. శనివారం కడప నగరం గీతం కళాశాలలో గత ఆరు రోజులుగా నాయకత్వ లక్షణాలపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న నాయకత్వ లక్షణాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు.

## నాణ్యత విషయంలో రాజీపడొద్దు: ఎమ్మెల్సీ


ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఉపాధ్యాయులను సూచించారు. శనివారం పట్టణ పరిధిలోని ఇస్లాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని, కూరలను రుచిచూశారు. భోజనం ఎలా చేస్తున్నారని విద్యార్థులను అడిగారు. ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

## కన్నులపండువగా కరిమలవాసుని గ్రామోత్సవం


ప్రధాన కలశాలు, జ్యోతులతో అయ్యప్ప స్వాములు, మహిళలు

చెన్నూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెలో శనివారం జరిగిన అయ్యప్ప స్వామి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. గురుస్వామి ఆవుల నాగమల్లారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. గ్రామోత్సవంలో ఇతర మండలాల నుంచి సైతం అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. దేవతామూర్తుల వేషధారణలు అలరించాయి.





## వేముల సీఐ బదిలీ

వేముల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్కేవ్యాలీ సీఐగా పనిచేస్తున్న నాగరాజు బదిలీ అయ్యారు. ఈయన సోషల్ మీడియా సైబర్ క్రైమ్ సెల్‌కు బదిలీ అయ్యారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఉలసయ్య బదిలీపై ఇక్కడకు రానున్నారు.

## విద్యుత్ మీటర్ రీడర్ల వినతి

పులివెందుల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ మీటర్ రీడర్లు శనివారం డీఈ ప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తమను ఉద్యోగం నుంచి తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు.



# తుఫాన్‌తో ఆందోళనలో రైతులు

- రోడ్లపైన ధాన్యం ● దళారుల ఇష్టారాజ్యం
- తుంపర వర్షంతో లబోదిబోమంటున్న అన్నదాతలు

ఖాజీపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఆకాశంలో మబ్బులు రావడంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందే సమయంలో తుంపర చినుకులు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌లోసాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది అయినా నాలుగు రూకలు వస్తాయనుకుంటే అప్పులు మిగులుతున్నాయని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

**● దళారుల ఇష్టారాజ్యం..:** కేసీకెనాల్, బోరుబావుల కింద సాగు చేసిన వరి పంట నూర్పిడి జరుగుతుండడంతో దళారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నచందంగా వ్యవహరిస్తూ రోజు రోజుకు ధరలను ఇష్టానుసారంగా తగ్గించి దోచుకుంటున్నారు. రైతులు ఇంత అన్యాయమా అని ప్రశ్నిస్తే వర్షాలు వస్తున్నాయి, మాకు వద్దు, మేము చెప్పిన ధరకు ఇస్తే తీసుకుంటాం లేదంటే మీ ఇష్టం మీకు నచ్చినవారికి అమ్ముకోండి అని చెప్పడంతో రైతులు ఏమీ చేయలేక వచ్చినకాడికే అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అయితే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవడం తథ్యమని ప్రభుత్వం స్పందించి వారి ఆగడాలను అరికట్టి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

**● రోడ్లపైన ధాన్యం..:** వర్షం పడితే పంట చేతికి రాదని, రైతులు నూర్పిడి చేసి రోడ్లపై ధాన్యం పోసి కుప్పలకు పట్టలు కప్పుతున్నారు. ఇలాగే మరోరెండు రోజులు ఉంటే మొలకెత్తుతాయని అటు దళారులు కొనక, ఇటు వరుణ దేవుడు ఆగ్రహించడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట పండించినా గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతన్నలు అంటున్నారు.



ఖాజీపేట...వరి నూర్పిడి చేస్తున్న యంత్రం



ఖాజీపేట.. ధాన్యానికి పట్టలుకప్పిన దృశ్యం



దువ్వూరు... మూడిండ్లపల్లెలోని ఉల్లిపంట

### కమ్ముకున్న మబ్బులు - ఉల్లిరైతుకు దిగులు

దువ్వూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేపీ ఉల్లి రైతుల్లో గుబులు మొదలైంది. ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలా మేరకు పెద్దబళ్లారి రకం ఉల్లిపంట తొలగించి విక్రయించారు. ప్రస్తుతం కేపీ ఉల్లిపంట చేతికందే దశలో ఉంది. ఇప్పుడు వర్షం పడితే గడ్డలకు కుళ్లు సోకే అవకాశం ఉంది. పంట తొలగించిన రైతులు గడ్డలు పాడవుతాయని దిగులు పడుతున్నారు. రాంసాయి నగర్, మదిరేపల్లె, దాసరిపల్లె, నీలాపురం, గుడిపాడు, రామాపురం గ్రామాల్లో కేపీ ఉల్లి పంటను సాగు చేశారు. ప్రస్తుతం క్వింటాలు ధర రూ.5 వేల నుంచి రూ.6,500 వరకు ఉంది.

### వరి కోతలకు మూడు రోజులు ఆగండి

లక్ష్మీప్రసన్న, ఏవో

మైదుకూరు రూరల్‌నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు కోయాలనుకొనే రైతులు మూడు రోజులు ఆగాలని ఏవో లక్ష్మీప్రసన్న శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకొన్న నేపథ్యంలో చిరుజల్లులతో కూడిన వర్షం పడుతుండటం వలన వరి కోతలను మూడు రోజుల పాటు వాయిదా వేయాలని ఆమె తెలిపారు. ఒక వేళ ఇది వరకే వరి కోత కోసి ఉంటే టార్పాలిన్ పట్టలను కప్పిఉంచుకోవాలన్నారు.అధిక వర్షం పడితే నీరు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వరి పైరులో మొలకలు రాకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని తెలిపారు. తుఫాన్ తరువాత వరి పైరు తెగుళ్ల బారిన పడకుండా ట్రైసైక్లోజో ల్ రెండు గ్రాములు ఒక లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

## అన్నదానం



అన్నదానం చేస్తున్న చల్లా రాజగోపాల్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీ నాయకుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శనివారం అన్వర్‌హాల్ వద్ద ప్రజలకు రుచికరమైన భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ త్వరలో ప్రతి శనివారం అన్నదానం జరుగుతుందని, రెండు వారాలు పాత బస్టాండు వద్ద, రెండు వారాలు అన్వర్ హాలు వద్ద, పౌర్ణమి రోజు టుటౌన్ పోలీసు స్టేషన్ సమీపాన ఉన్న పెద్దమ్మగుడి వద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లా మధు, రవిశంకర్, రమణ, సుబ్బరాజు, రామయ్యపాల్గొన్నారు.

## తూతూమంత్రంగా మండల సమావేశం

అట్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమావేశం పొత్తపి రమాదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. మండల అధికారులు కలెక్టరు సమావేశానికి వెళ్లడంతో ఎటువంటి అజెండా లేకుండా తూతూ మంత్రంగా మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి ఎంపీడీవో భాస్కరబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరయ్యారు. తమ వెంట తీసుకువచ్చిన సమాచారం వినిపించి మమ అనిపించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, వెలుగు సీసీలు, వైద్యాధికారి సీహెచ్‌వో మురళీక్రిష్ణ పాల్గొన్నారు.

## రేపు వాహనాల వేలం

మైదుకూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఎక్సైజ్ కార్యాలయం లో వివిధ కేసుల్లో పట్టుబడిన కారు, రెండు ద్విచక్ర వాహనాల వేలం జరుగుతుందని మైదుకూరు ఎక్సైజ్ సీఐ ధీరజ్ కుమార్‌రెడ్డి శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు.వేలం వాహనాలు కావలసిన వారు ఆఫీసులో సంప్రదించాలన్నారు.

## పృథ్వీనాథ్‌రెడ్డికి బంగారు పతకం



బంగారు పతకాన్ని అందుకుంటున్న పృథ్వీనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ కాలేజీలో క్యాంపస్‌లో బీటెక్ బయోటెక్నాలజీ చదువుతున్న బూచుపల్లి పృథ్వీనాథ్‌రెడ్డి బంగారు పతకాన్ని సాధించారు. ఎర్రగుంట్ల మండలంలోని నున్నపురాళ్లపల్లెకు చెందిన పృథ్వీనాథ్ 2023-2024 విద్యాసంవత్సరానికి 9.5సీజీపీఏ సాధించి ఈ బంగారు పతకాన్ని సాధించారని తండ్రి సుధాకర్‌రెడ్డి తెలిపారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ జడ్జి షేక్ బాబాఫక్రుద్దీన్, జడ్జి భార్గవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. అనంతరం జడ్జి బాబాఫక్రుద్దీన్ 14వ తేదీ జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ఉంటుందన్నారు. అనంతరం జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో న్యాయవాదులతో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్ సభ్యురాలు సంధ్య, జైలు సూపరింటెండెంట్ హర్షవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

బద్వేలుటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. బద్వేలు సాధారణ సమావేశం శనివారం మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అజెండా మొదలుపెట్టకముందే పార్క్ ఏర్పాటుపై తీవ్రమైన చర్చసాగింది. ప్రభుత్వస్థలాలు అన్నీ కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని కాపాడుకొని, వాటిలో పార్కులు ఏర్పాటు చేసుకోవడంపై దృష్టిపెట్టడంలేదని ప్రజలు మండిపెడుతున్నారని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తెచ్చారు. వెంటనే కమీషనర్ వివరణ ఇస్తూ ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా పార్క్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ గెలిచినవార్డుల్లో గత ప్రభుత్వంలోకానీ, ఇప్పుడు కానీ దృష్టి పెట్టలేదని ఆయా వార్డు సభ్యులు పేర్కొన్నారు.

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

రాజుపాలెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 25న క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఒక నెల ముందు శమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. దీంట్లో భాగంగా మండలపరిధిలోని టంగుటూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్‌ను క్రిస్టియన్లు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వేడుకల గురించి పాస్టర్ వర ప్రసాద్ వివరించారు.

## నేటి కార్తీక వనభోజన మహోత్సవాన్ని జయప్రదం చేయండి

జమ్మలమడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని కోవెలకుంట్ల రోడ్డులో ఆదివారం శ్రీరంగనాథస్వామి కల్యాణ మండపంలో జమ్మలమడుగు ప్రాంత ఆరు గ్రామాల పద్మశాలీయులకు ఆత్మీయ కార్తీక వనభోజన మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహకులు శిలివేరు దశరథ రామయ్య, చింతలపల్లె రుద్రమహేశ్వరుడు తెలిపారు. ఈ కార్యక్రమం పద్మశాలీయుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి అక్కడ లక్ష్మీగాయత్రి హోమం, అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన, మధ్యాహ్నం సభ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీయ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వాహనాల ద్వారానే సరుకులు అందించాలి

ప్రొద్దుటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంగన్ వాడీ కేంద్రాలకు ప్రభుత్వ వాహనాల ద్వారా నేరుగా రేషన్ బియ్యంతో పాటు ఇతర సరుకులు అందించాలని తెలుగునాడు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘంనేతలు బచ్చల పుల్లయ్య ఘంటశాల వెంకటేశ్వర్లు బోగా కళ్యాణి కల్పన తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపట్ల అవగాహన పెంచుకోవాలి

ఎర్రగుంట్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలు తప్పనిసరిగా చట్టాలపట్ల అవగాహనను పెంచుకోవాలని కమలాపురం జడ్జి లావణ్య పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టం, న్యాయం గురించి మరింత అవగాహనను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, పుష్పరాజ్, పోలీసులు, కోర్టు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నభోజన కార్మికుల పెండింగు బిల్లులు, స్కూలు ఆయాల నాలుగు నెలల పెండింగులో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సఫా, పీరయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుకమ్మ పిలుపునిచ్చారు. శనివారం వారు మాట్లాడుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలన్నారు.

## ప్రతి పేదవాడికి ప్రభుత్వ భూమి అందాలి : సీపీఎం

కాశినాయన నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీద్వారా ప్రతి పేదవాడికి భూమి అందేలా చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్, మనోహర్, జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్ డిమాండ్ చేశారు. శనివారం నర్సాపురంలో సీపీఎం పార్టీ మండల ద్వితీయ మహాసభలు నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జెండాను ఆవిష్కరించి దివంగత నేతసీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పోలయ్య, కలసపాడు, మతం మండలం నాయకులు గురయ్యసునీల్ పాల్గొన్నారు.

## అమ్మవారిశాలలో దీపాలంకరణ



మైదుకూరు రూరల్‌నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హరహర మహాదేవ శంభో శంకర అంటూ ఆర్యవైశ్య మహిళలు మహాశివుని ప్రతిమపై దీపాలను అలంకరించారు.స్థానిక అమ్మ వారి శాలలో కార్తీక మాసంలో చివరి శనివారం కావడంతో ఆర్యవైశ్య మహిళలు శివలింగం, మహాశివుడు,జువ్విచెట్టు తదితర ప్రతిమలను ముగ్గుపిండితో వేసి దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమం ఆర్యవైశ్య మహిళ మండలి సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను అధికారులు, కక్షిదారులు, న్యాయవాదులు జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి డి.గాయత్రి కోరారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్‌అదాలత్‌పై అధికారులతో న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) :సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోరుమామిళ్ల ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాముల్‌డేవిడ్‌రాజ్, అధ్యాపకులు కళ్యాణ్‌కుమార్, మల్లిఖార్జున, వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, సులోచన, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## వైభవంగా భద్రకాళీ వీరభద్రస్వామి కల్యాణం

అట్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భద్రకాళీ వీరభద్రస్వామి కల్యాణం శనివారం ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించారు. వీరభద్రస్వామి చతుర్థ వార్షికోత్సవ సందర్భంగా స్వస్తిశ్రీ క్రోధినామసంవత్సరం కార్తీక మాస బహుళ అమావాస్య ఉదయం రుద్రాభిషేకంతో వేద పండితులతో కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం మహానైవేద్యం, అన్నదాన కార్యక్రమం జరిగాయి. రాత్రికి అగ్నిగుండం, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## విద్యతో పాటు వృత్తివిద్యపై నైపుణ్యమూ అవసరం

బద్వేలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు వృత్తివిద్యపై నైపుణయం అవసరమని వృత్తి విద్యా ఉపాధ్యాయులు బేరి సునీల్‌కుమార్, వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. బద్వేలులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇండస్ట్రియల్ శిక్షణలో భాగంగా శనివారం 9,10 వ తరగతి విద్యార్థులతో కలిసి వారు ఉప విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అలాగే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నయ్య విద్యార్థులకు పరికరాల పనితీరుపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్ఎం కరీముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఉద్యోగి సస్పెన్షన్

ప్రొద్దుటూరు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో సీ6 క్లర్క్‌గా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ జీవీఎస్ కళ్యాణ్‌కుమార్ సచివాలయ ఉద్యోగుల వద్ద లంచం డిమాండ్ చేసినట్లు రుజువైనందున మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 28 న ఆంధ్రజ్యోతి పత్రికలో మున్సిపాలిటీని వీడని అవినీతి చీడ వార్త కథనం ప్రచురితమైంది. ఈ కధనానికి స్పందించిన కమిషనర్ మల్లికార్జున మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సీ6 క్లర్క్ కళ్యాణ కుమార్ పై విచారణ చేపట్టారు. ఈ విచారణలో లంచం డిమాండ్‌చేసినట్లు సచివాలయ ఉద్యోగులు ఎంక్వైరీ కమీషనర్ ముందు సాక్ష్యం చెప్పినట్లు నివేదించారు. ఈ నివేదిక ఆదారంగా ఆర్‌డీ విశ్వనాథం సినీయర్‌అసిస్టెంట్ కళ్యాణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## మున్సిపాలిటీలో అక్రమాలపై విచారణకు రానున్న అధికారులు వీరే

ప్రొద్దుటూరు నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన టెండర్లలో జరిగిన అక్రమాలు, నాసిరకం పనులు, టౌన్ ప్లానింగ్‌లో అక్రమ కట్టడాలకు అనుమతులు ఇవ్వడం పై ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి సీఎంవోకు చేసిన ఫిర్యాదు మేరకు ప్రభుత్వం వేసిన ఎంక్వైరీ కమిషన్‌ను రీజనల్ డైరెక్టర్‌ఆధ్వర్యంలో నియమించింది. ఈ ఎంక్వైరీ కమిషన్‌లో సభ్యులను నియమిస్తూ శనివారం ఆర్‌డీ విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కర్నూలు అడిషనల్ కమిషనర్ క్రిష్ణ, చిత్తూరు డీటీసీపీవో చంద్రమోహన్, చుడా పీవో యూ మోహన్‌కుమార్, అనంతపురం కార్పొరేషన్ డీఈ ఎన్ శ్రీ సత్యనారాయణ, అనంతపురం కార్పొరేషన్ ఈఈ ఏఎండి షాకీర్ ,ఎమ్మిగనూరుమున్సిపల్ ఏఈ శరత్ చంద్ర, చిత్తూరు కార్పొరేషన్ టీపీవో సుభప్రభ, కడప మున్సిపల్ కార్పొరేషన్ ఏఎస్‌వో గంగిరెడ్డి, ఎమ్మిగనూరు మున్సిపల్ రెవిన్యూ ఆర్‌వో నాసీర్ పుంగనూరు మున్సిపాలిటీ జేఏవో ఎం శ్రీనివాసులును ఈ విచారణ కమిషన్‌లో నియమించారు. వీరంతా ఆర్‌డీ విశ్వనాధ్ సారధ్యంలో రెండురోజుల్లో ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి వచ్చి విచారణ చేపట్టనున్నారు.

## బాలమ్మ సత్రంలో అన్న వితరణ

కాశినాయన, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు అన్నదానం ఎంతో గొప్ప సేవాకార్యక్రమం అని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.రమణారెడ్డి,రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం పేర్కొన్నారు. శనివారం మండలంలోని బాలమ్మ సత్రంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఓ.బలరామిరెడ్డి సతీమణి తులశమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని 100 అనాథలకు అన్నవితరణ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్ సమీపంలోని ముబాకర్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మన ప్రజాసేవా సమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. సద్భావన సేవా సంఘం, మన ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు.

## 'ఎస్సీల ఇళ్లను కూల్చారనడం అవాస్తవం'

బద్వేలు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐలమ్మకాలనీ చెన్నంపల్లె గ్రామ పొలం సర్వేనెం.1580లో ఇళ్లను కూల్చివేశారంటూ దళిత హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు నాగదాసరి ఇమ్మానుయేల్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఇది తగదని గుల్జార్, జాఫర్, నాయబ్ అనే వ్యక్తులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూల్చివేశారన్న ఆరోపణలు చేసిన ఇళ్లకు వారికి పట్టాలు లేవని, 2016లోనే విద్యుత్ సర్వీసును తొలగించారన్నారు. ఇంటి పన్ను కరెంటు బిల్లులు కడుతున్నామంటూ అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# రోడ్లపై సెంటర్ పార్కింగ్ తొలగించాలి

అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసి ఇప్పడు రోడ్లపై వున్న సెంటర్ పార్కింగ్ తొలగించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై మున్సిపల్, రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమావేశంలో పలువురు అధికారులు నాయకులతో చర్చించిన మేరకు పట్టణంలో ప్రధానంగా గాంధీరోడ్డులో ట్రాఫిక్ తీవ్రంగా వుందని గుర్తించారు. అలాగే శివాలయం రోడ్డునుంచి గాంధీరోడ్డుకు లింక్‌గా వుండే కోనేటి కాల్వ వీధి , శ్రీరాముల పేట, హోమస్ పేట వీధులల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వుందని చర్చించారు. గాంధీరోడ్డు చాలా ఇరుకుగా మారడం ఆసుపత్రులు బ్యాంకులు, కాలేజీలు, సూపర్ మార్కెట్లు, ఐస్‌క్రీం పార్లర్లు, రెస్కారెంట్లు, టీ , టిఫిన్ సెంటర్ల పెద్ద ఎత్తును వుండటం వలన పార్కింగ్ లేక రోడ్లపై వాహనాలు నిలుపుతుండటంతో సమస్య వుందన్నారు. అంతేకాకుండా వున్న స్థలంలో సెంట్రల్ డివైడర్లు నిర్మించడంతో కూడా ఇరుకైందన్నారు. హోమస్ పేట, కోనేటి కాల్వ వీధులలో వున్న సెంట్రల్ పార్కింగ్‌ను తొలగించేందుకు ప్రత్యామ్నాయంగా పార్కింగ్‌ప్రదేశాలు ఎమ్మెల్యే సూచించారు. హోమస్ పేటలో వాహనాలు పార్కింగ్ చేయకుండా మడూరు కాలువ వెంబడి వున్న స్థలంలో రోడ్డు వేసి పార్కింగ్ అక్కడ ఏర్పాటు చేయాలన్నారు.అలాగే కోనేటి కాల్వవీధిలో సెంటర్ పార్కింగ్ తొలగించి సార్వకట్టవీధి వెనుకవున్న ప్రొద్దుటూరు చానల్‌కు అప్రోచ్ రోడ్డువేసి గాంధీరోడ్డు నుంచి మేదర వీధివరకు పార్కింగ్‌ను ఏర్పాటుచేయవచ్చని సూచించారు. అలాగే సుధా హాలు వద్ద వున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వున్న ఆక్రమణలు తొలగించి అక్కడ బస్సులు నిలిపేలా చూడాలన్నారు. మైదుకూరు రోడ్డులో ఆరవేటి హాలు వెనుక వున్న మున్సిపల్ స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు వీటిని యుద్ధ ప్రాతిపదికన మున్సిపాలిటీ పనులు చేపట్టితే ఆ ప్రదేశాల్లో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు గంగయ్య, ఆర్ అండ్‌బీ డీఈ లక్ష్మీ నరసింహులు, సీఐలు యుగంధర్ గోవిందరెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, రఫీ, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, టౌన్ బాంకు చైర్మెన్ బొగ్గుల సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి జిలాన్, కమాల్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నియంత్రణ అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి